# రజతోత్సవ సభకు తరలిరండి

- కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 25: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లా నుంచి ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులను సభకు తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సభకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని, 15 నెలల దుర్మార్గపు పాలన ప్రపంచంలో ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు విసిగి పోయారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయని ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈనెల 27న గ్రామగ్రామాన బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి, సభకు తరలివెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్, బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ సభకు తరలివెళ్లామని తెలిపారు. కాగా, అంతకుముందు జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మండలాధ్యక్షుడు ఆనంద రావు, పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంగెపు మహేశ్, నాయకులు ఆనంద రావు, వొల్లెం మల్లేశం, శీలం ప్రవీణ్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

**సభ ఏర్పాట్ల పరిశీలన**

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 25: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శుక్రవారం జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, రైతులను ఆగం చేసిందన్నారు. రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గడ్డం రాజారెడ్డి, ఆరెళ్ల రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా కదిలిరావాలి

సారంగాపూర్, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా కదిలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ కోరారు. బీర్‌పూర్ మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనం తరలించడంపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అలాగే, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు తెలు రాజు, నేరెళ్ల సుమన్ గౌడ్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను సభకు తరలించేందుకు సన్నద్ధం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు అనంతుల గంగారెడ్డి, కిషన్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం

సారంగాపూర్, ఏప్రిల్ 25: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బీర్‌పూర్‌లోని రైతువేదిక ఆవరణలో శుక్రవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, బీర్‌పూర్ మండలంలో రెవెన్యూ, అటవీ భూముల విషయంలో ప్రజల్లో, అధికారుల్లో కొంత అయోమయం ఉందన్నారు. రైతుల భూములు ధరణిలో అసైన్డ్ భూములుగా చూపడం వల్ల ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి భూభారతి చట్టం ద్వారా రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ రాంచందర్ రావు, విండో చైర్మన్ నవీన్ రావు పాల్గొన్నారు.

# దవాఖాన అభివృద్ధికి కృషి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కోరుట్ల, ఏప్రిల్ 25: ప్రభుత్వ ఏరియా దవాఖాన అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి నిధులు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోరుట్లలో ప్రజల సౌకర్యార్థం రూ. 12 కోట్లతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సహకారంతో వంద పడకల దవాఖాన నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా దవాఖాన అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రులను పలుమార్లు కలిసి దవాఖాన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. దవాఖాలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, అన్వర్, రవీందర్, ఆనంద్, దవాఖాన సూపరింటెడెంట్ సునీతారాణి, వైద్యులు వినోద్, రమేశ్, రామకృష్ణ, ఉదయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.


దవాఖానలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

**తెలంగాణ సాధనలో పాత్రికేయుల పాత్ర అభినందనీయం**

తెలంగాణ రాష్ట్ర సాధనలో పాత్రికేయుల పాత్ర అభినందనీయమని, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ వెన్నంటి ఉద్యమంలో నిలిచారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. పట్టణ శివారులోని శివసాయి గార్డెన్‌లో శుక్రవారం ఆయన పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను పాత్రికేయులకు అందజేశారు. ఈ అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వరాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే నంబర్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సాగు, తాగునీరు, 24 గంటల కరెంట్ అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చీటి వెంకట్రావు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పహల్గాం మృతులకు నివాళి



కోరుట్ల: పట్టణంలో పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

మెట్‌పల్లి/ధర్మపురి/కోరుట్ల/కథలాపూర్/జగిత్యాల టౌన్/ రాయికల్/ కొడిమ్యాల/మేడిపల్లి, ఏప్రిల్ 25: పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా వ్యాప్తంగా ఆయా సంఘాలు, పార్టీల నాయకులు, ముస్లింలు శుక్రవారం నివాళులర్పించారు. కాగా, మెట్‌పల్లి పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే, బర్కత్‌పుర యూత్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు నల్ల బ్యాడ్జీలు ధరించి మసీద్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ఖాజా అజీమ్, తమీజ్, రైస్, సమీర్, సిరాజ్, రషీద్ పాల్గొన్నారు. అలాగే, శాస్త్రీ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పహల్గాం దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇల్లెందుల శ్రీనివాస్, రాకేశ్, నాంపల్లి వేణు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం చింతకుంటలో యువకులు, భూషణరావుపేటలో చిన్నారులు, మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జగిత్యాల పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. వర్తక, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. డీఎస్పీ రఘుచందర్, సిఐ వేణుగోపాల్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి సంతోష్‌కుమార్, నగర కార్యదర్శి ఎరుగుగట్ల పరందాం, బజరంగ్‌దళ్ టౌన్ కన్వీనర్ పాదం మహేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రాయికల్ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. అలాగే, మృతిచెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని సెంట్రల్ ముస్లిం కమిటీ సభ్యులు నివాళులర్పించారు. కోరుట్ల పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు అనూప్‌రావు, రాజేశ్, జగదీశ్వర్, అన్వేష్, రవికిరణ్, స్వీతి అనూప్, మనోజ్, రమేశ్, ఇంద్రనీల్, నరేశ్, సంపత్, లక్ష్మీపతి, రాజేందర్, అనురాధ, జ్యోత్స్న, ప్రియాంక పాల్గొన్నారు. ధర్మపురి పట్టణంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి, ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జహింగీర్, ఇక్రామ్, రఫీయొద్దీన్, యూనుస్, ఇసాక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు. కొడిమ్యాలలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. మేడిపల్లిలో ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు.


మెట్‌పల్లి: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## వడదెబ్బతో యువకుడి మృతి

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 25: పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన గొల్లపెల్లి జగన్ గౌడ్(35) వడదెబ్బతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగన్ గౌడ్ ఎండదెబ్బ తాకడంతో తీవ్ర అస్వస్థతకు గురై స్పృహతప్పి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఇంటి వద్దే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

## మహిళ అదృశ్యం

కోరుట్ల, ఏప్రిల్ 25: పట్టణంలోని ఆనందనగర్ కాలనీకి చెందిన వొర్సు సోమక్క (49) అదృశ్యమైంది. సోమక్కకు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పట్టాలు అందుకున్న చిన్నారులతో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు

## పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, ఏప్రిల్ 25: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం పోషణ పక్షం–పోషణ జాతర, అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ ప్రీ స్కూల్లో చదువుకున్న విద్యార్థులు ఎంతో చురుగ్గా ఉంటారని పేర్కొన్నారు. పోషణ పక్షం–పోషణ జాతర కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా సంక్షేమాధికారి నరేశ్‌తోపాటు శాఖ సిబ్బందిని అభినందించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణకు సంబంధించి వివిధ స్టాల్స్ ఏర్పాటు చేశారు. చిన్నారులకు పట్టాలు ప్రదానం చేశారు. అలాగే, ఆర్థిక పునరావాస పథకం కింద 15 మంది దివ్యాంగులకు రూ. 50 వేల చొప్పున సబ్సిడీ రుణాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బోనగిరి నరేశ్, ఐసీడీఎస్ సీడీపీవోలు మమత, వాణిశ్రీ, వీరలక్ష్మి, మణెమ్మ, డీసీపీవో హరీశ్, జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ మధుకుమార్, పోషణ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఆర్ఎంపీ ఆత్మహత్య


జగదీశ్‌బాబు (ఫైల్)

మేడిపల్లి, ఏప్రిల్ 25: మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ సాంబారు జగదీశ్‌బాబు (44) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మధుకర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్‌బాబు మూడేళ్లుగా మెడనొప్పితో బాధపడుతున్నాడు. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో శస్త్ర చికిత్స చేయించినా నయం కాలేదు. ఆపరేషన్ కోసం రూ. 5 లక్షల వరకు ఖర్చు కావడంతో కుటుంబ పోషణ కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన జగదీశ్‌బాబు శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి జగిత్యాలలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డాక్టర్ పరీక్షించి, మృతి చెందినట్లు తెలిపారు. జగదీశ్‌బాబు భార్య రూపశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


పెగడపల్లి, ఏప్రిల్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. నామాపూర్ జడ్పీ, ప్రాథమిక పాఠశాలల వార్షికోత్సవం గురువారం రాత్రి నిర్వహించగా, విప్‌తో పాటు డీఈవో రాము హాజరయ్యారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సులోచన, ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, హెచ్‌ఎంలు లలిత, భారతి, అనిల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మంచి గ్రంథాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి


జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 25: మంచి గ్రంథాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'జగిత్యాల జిల్లా సమగ్ర స్వరూపం' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై గ్రంథావిష్కరణ చేశారు. అంతకుముందు పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, డీఈవో రాము, మున్సిపల్ మాజీ చైర్మన్లు జ్యోతి, గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నవీన్, సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ రామకృష్ణ, లైబ్రరీ మాజీ డైరెక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకుల వంటావార్పు


కళాశాల ఆవరణలో వంటావార్పు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కొడిమ్యాల, ఏప్రిల్ 25: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు హరీశ్‌కుమార్, జయంత్, ఉదయ్, శ్రీనివాస్, శశికాంత్, రాజు, రాకేశ్, కుమారస్వామి, లత, గౌతమి పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల, ఏప్రిల్ 25: కోరుట్ల నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. నియోజకవర్గానికి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వెల్గటూర్, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్డీవో రఘువరన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పైడిపెల్లి ఐకేపీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, తూకం వేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు.

## మామిడి కొనుగోలు కేంద్రాల సందర్శన

మెట్‌పల్లి, ఏప్రిల్ 25: పట్టణ శివారులో నిర్వహిస్తున్న మామిడి కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ శుక్రవారం సందర్శించారు. కేంద్రాలకు రైతులు తీసుకొస్తున్న మామిడి కాయలను పరిశీలించారు. మామిడి విక్రయించిన ప్రతి రైతుకు వ్యాపారులు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది సతీశ్‌కుమార్ ఉన్నారు.


## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కోరుట్ల రూరల్/సారంగాపూర్, ఏప్రిల్ 25: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. కోరుట్ల మండలం ఐలాపూర్, బీర్‌పూర్ మండలం మోతీనగర్‌లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రతి రోజూ కేంద్రాలకు ఎంత ధాన్యం వస్తున్నది, తూకం వేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్లు ఫారుక్, ముంతాజొద్దీన్, ఎంపీడీవో వోదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఆర్ఐ రాజేందర్‌రావు, కార్యదర్శి నవీన్, సిబ్బంది తదితరులున్నారు.

## 'భూభారతి'తో రైతులకు ప్రయోజనం

కోరుట్ల/కోరుట్ల రూరల్, ఏప్రిల్ 25: భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని అష్టలక్ష్మి కల్యాణ మండపంలో శుక్రవారం భూభారతి చట్టంపై రైతులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో జివాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ పారుక్, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2013–14 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లికార్జున్, గంగాధర్, గణేశ్, అనిల్, మహేశ్, సాయిచందు, శివ తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 25: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాలలో శుక్రవారం ఆయన వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, డాక్టర్ శ్రీలత, ఏఎన్‌ఎంలు మేరీ, మాదేశి శిరీష, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

మల్లాపూర్, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గ్రామానికి చెందిన పెరుమాండ్ల నారాయణగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, నాయకులు రవీందర్, రాజం, సత్యనారాయణ, సోమయ్య, రమేశ్, భూమయ్య, సురేశ్, సాయిలు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సారంగాపూర్, ఏప్రిల్ 25: బీర్‌పూర్‌లో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, విండో మాజీ చైర్మన్ పొలుసాని నవీన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను సిద్ధం చేయాలి

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 25: వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేగుంట నర్సరీలోని శుక్రవారం ఆయన మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండి పోకుండా నీళ్లు పట్టాలని, ఎండిపోయిన వాటిని తొలగించి కొత్త నారు పోసి మొక్కలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, జూనియర్ అసిస్టెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, అనిల్, నరేశ్ పాల్గొన్నారు.

## దుంపేటలో బడిబాట కార్యక్రమం

కథలాపూర్, ఏప్రిల్ 25: కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇండ్లకు వెళ్లి కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు రాజ్‌కిరణ్, చంద్రమౌళి, జయశ్రీ, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ దరఖాస్తుదారుల సర్వే పరిశీలన

కథలాపూర్, ఏప్రిల్ 25: భూషణరావుపేటలో ఇందిరమ్మ దరఖాస్తుదారుల సర్వేను నియోజకవర్గ ప్రత్యేకాధికారి వినోద్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ప్రకారం మండలాధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి ఎండీ గఫూర్, నాయకులు ఉన్నారు.

## విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

కథలాపూర్, ఏప్రిల్ 25: తాండ్ర్యాల గ్రామంలో రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనశుద్ధిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో యోగిత, ఏఈవో సుష్మా, రైతులు తిరుపతి, గంగారావు, సంజీవ్, కొండయ్య పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కథలాపూర్, ఏప్రిల్ 25: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన బత్తుల రాజు (38) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బత్తుల రాజు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి తోడు కుటుంబ పోషణ భారం కావడంతో మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజుకు భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు

సారంగాపూర్, ఏప్రిల్ 25: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని సారంగాపూర్, బీర్‌పూర్ ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ పేర్కొన్నారు. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఏలేటి వైశ్రిత ఎంపీసీ మొదటి సంవత్సరంలో 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. కాగా, వైశ్రితను శుక్రవారం ఆయన శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, నాయకులు గంగారెడ్డి, లక్ష్మీరాజం, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## కూలీలకు పని కల్పించాలి

పెగడపల్లి, ఏప్రిల్ 25: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పించాలని డీఆర్డీవో రఘువరన్ అధికారులను ఆదేశించారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించి 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, ఏప్రిల్ 25: లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన సింగిల్ విండో చైర్మన్ ఏలేటి నర్సింహ రెడ్డి తల్లి రాజవ్వ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, నాయకులు రాజేందర్ రెడ్డి, సుధాకర్ రావు, సంతోష్, మల్లేశ్, శేఖర్ తదితరులున్నారు.

## నిధులు మంజూరు చేయాలి

సారంగాపూర్, ఏప్రిల్ 25: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ నుంచి చిత్రవేణి గూడెం, తాళ్లధర్మారం, రేకులపల్లి నుంచి ఆరపెల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను జగిత్యాలలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I Rampelli Rajitha D/o Limbaiah. After Marriage My Name Was Changed Along With Surname As **JOGA LALITHA W/o. JOGA RAMU.** For All Purposes.

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189